

పెర్సాపేన్‌కు పూజలు

కెరమెరి మండలంలోని హట్టిలో మెసల్కార్ మడావి వంశస్తులు పెర్సాపేన్ (పెద్దదేవుడు)కు పూజలు నిర్వహించారు. కొత్త కోడళ్లు బేటింగ్ అయ్యారు. 8లో▸



ప్రయాణం నరకప్రాయం!

చింతలమానెపల్లి మండలంలోని రహదారులు అధ్వానంగా మారాయి. నిబంధనలు అతిక్రమించి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకునే వారే లేరు. 9లో▸

గరిష్టం/కనిష్టం
35.0 /26.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. పలుచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ఏకలవ్య గురుకుల ప్రవేశ పరీక్ష

కాగజ్‌నగర్‌టౌన్: 2023–2024 విద్యాసంవత్సరానికి గానూ ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి ఆదివారం నిర్వహించనున్న పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ సాయిలు తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశంతో పాటు 7, 8, 9 తరగతుల్లోని ఖాళీలను భర్తీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆరో తరగతిలో ప్రవేశానికి ఉదయం 10:30 నుంచి 12.30 గంటల వరకు, 7, 8, 9 తరగతుల్లో ప్రవేశానికి మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని కాగజ్‌నగర్, ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి ఏకలవ్య పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆరో తరగతిలో 60 సీట్లు, 7, 8, 9 తరగతుల్లో ఉట్నూర్‌లో ఏడు, కాగజ్‌నగర్‌లో 22, నార్నూర్‌లో 20, ఇంద్రవెల్లిలో 33 ఖాళీలున్నాయి. ప్రతిభ, రిజర్వేషన్ల ప్రాతిపదికన తెలంగాణ రాష్ట్ర ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల సమితి(ఈఎంఆర్ఎస్ఎస్‌టీ) ఆధ్వర్యంలో ఎంపిక జరుగనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: విద్యుత్ వినియోగం, పొదుపుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వినియోగదారులు తగు బాధ్యతలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని డివిజనల్ ఇంజినీర్ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది భద్రత సూత్రాలు పాటిస్తూ పని చేయాలని, ఎర్త్ రాళ్ల తప్పనిసరిగా వాడాలని సూచించారు. ఎక్కడైనా కరెంటు వైర్లు తెగిన వెంటనే సంబంధిత సిబ్బందికి తెలియజేయాలన్నారు. రోజుకు ఒక యూనిట్ విద్యుత్ ఆదా చేస్తే జీవితంలో లక్ష రూపాయలు ఆదా చేసిన వారవుతారన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఈ రవీందర్, ఎస్ఎల్ఐ విలాస్, ఎల్ఐ శ్రీనివాస్, ఎల్ఎం సురేష్, రాహుల్, రాజేందర్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై మాయావతి వైఖరి ప్రకటించాలి



మాట్లాడుతున్న రేగుంట కేశవ్‌రావ్

ఆసిఫాబాద్‌అర్బన్: ఎస్సీ వర్గీకరణపై బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి తమ వైఖరి ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రేగుంట కేశవ్‌రావ్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల భవిష్యత్ ఉందన్నారు. ఎస్సీల వర్గీకరణ కోసం దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు తమ మద్దతు తెలిపి కేంద్ర ప్రభుత్వానికి లేఖలు పంపిస్తే బీఎస్పీ మాత్రం వ్యతిరేకించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఈ నెల 7న హైదరాబాద్‌లో బీఎస్పీ నిర్వహించే తెలంగాణ భరోసా బహిరంగసభకు హాజరవుతున్న మాయావతి తన వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మహేష్, మల్లేశ్, చిన్నక్క, భాస్కర్, కాశమ్మ, దీపక్, తదితరులు పాల్గొన్నారు.

'అగ్రికల్చర్ జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలి'



వినతిపత్రం ఇస్తున్న నర్సరీ కార్మికులు

రెబ్బెన(ఆసిఫాబాద్): తమకు అగ్రికల్చర్ జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలని కోరుతూ గోలేటిలోని సింగరేణి నర్సరీలో పని చేస్తున్న కార్మికులు శనివారం ఎస్‌వోటూ జీఎం కేహెచ్‌ఎన్ గుప్తాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది సింగరేణి యాజమాన్యం, ఆర్ఎల్‌సీ వద్ద జరిగిన ఒప్పందం ప్రకారం రోజుకు రూ.459 వేతనం అందించాలని, అగ్రికల్చర్ జీవోను వెంటనే సింగరేణిలో అమలు కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు చిన్నుబాయి, శారద, అనిత, విజయలక్ష్మి, సాలమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లంఘనులకు అడ్డేది?



తుంపల్లివద్ద రహదారికి ఆనుకుని సర్వే నంబర్ 25లో వెలిసిన అనధికారిక వెంచర్

- జిల్లాలో యథేచ్ఛగా అక్రమ వెంచర్లు
- ఏజెన్సీ, బీడీపీపీ భూముల్లో కోకొల్లలు
- ఏ ఒక్కదానికీ డీటీసీపీ అనుమతుల్లేవ్!
- పట్టించుకోని అధికారులు

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లాలో అనధికారిక వెంచర్లు నానాటికీ పెరుగుతూనే ఉన్నాయి. ఎలాంటి అనుమతుల్లేకుండానే ఏజెన్సీ, బీడీపీపీ భూముల్లో అక్రమ వెంచర్లు కోకొల్లలుగా వెలుస్తున్నాయి. ఏజెన్సీ భూములు అధికంగా ఉన్న జిల్లాలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ సంక్లిష్టం కావడంతో బాండు పేపర్ల మీద క్రయవిక్రయాలకు పాల్పడుతున్నారు. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోనే ఈ తంతూ జరుగుతున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఏజెన్సీ ప్రాంతాల్లో..

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో వేలాది ఎకరాల్లో ఏజెన్సీ భూములు ఉన్నాయి. గ్రామ పంచాయతీగా ఉన్న ఆసిఫాబాద్ జిల్లాగా రూపాంతరం చెందడం.. నాలుగు వరుసల రహదారి ఏర్పాటు కావడం.. కొత్త కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు నిర్మించడం వంటి అభివృద్ధి పనులు శరవేగంగా జరగడంతో ఆసిఫాబాద్ చుట్టూ ఉన్న భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమ వెంచర్ల దందాకు తెరతీశారు. వాస్తవానికి ఏజెన్సీ భూముల్లో సాగు మాత్రమే చేయాలి. వెంచర్లు వేయరాదు. కానీ భూ యజమానులతో కుమ్మక్కయిన రియల్‌ఎస్టేట్ వ్యాపారులు వారి భూములను తీసుకుని అనధికారికంగా వెంచర్లు వేసి పేపర్లపై క్రయవిక్రయాలకు పాల్పడుతున్నారు. కలెక్టరేట్‌కు సమీపంలోని తుంపల్లి గ్రామ శివారు సర్వే నంబరు 25లో ఇటీవల కాగజ్‌నగర్‌కు చెందిన జాతీయ పార్టీ నాయకుడు అక్రమంగా 4 ఎకరాల్లో వెంచర్లు వేసి ఒక్కో ప్లాటుకు రూ.5 లక్షల చొప్పున క్రయవిక్రయాలు జరుపుతున్నారు. రహదారికి ఆనుకునే ఉన్న స్థలంలో అక్రమంగా వెంచరు వేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. కాగజ్‌నగర్ మండలంలోని నజ్రూల్‌నగర్ ఏజెన్సీ భూముల్లోనూ ఎలాంటి అనుమతులు లేకుండానే వెంచర్లు వేశారు.

బీడీపీపీ భూముల్లో..

నిజాం కాలంలోనే జిల్లాగా ఉన్న ఆసిఫాబాద్‌లో వందలాది ఎకరాల బీడీపీపీ (బిలా దాఖలా పోరం పోగు) భూములు ఉన్నాయి. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, ఈజ్‌గాం, బంటుపల్లి తదితర ప్రాంతాల్లోని బీడీపీపీ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు వేశారు. జిల్లా కేంద్రంలోని చెక్‌పోస్టు వెనుక, ముందు వైపు, నాలుగు వరుసల రహదారి పక్కన 215 ఎకరాల బీడీపీపీ భూముల్లో నేడు పదుల సంఖ్యలో వెంచర్లు వెలిశాయి. అక్కడ భారీ భవనాలు సైతం నిర్మించారు. నిరుపేదలకు ఇచ్చిన ఈ భూముల్లో కొత్తగా నివాస గృహాలు నిర్మించడం.. వెంచర్లు వేసి క్రయవిక్రయాలు జరపడం ఇక్కడ నిషేధం. కానీ రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆ నిబంధనలను బేఖాతర్ చేస్తూ ఏకంగా బీడీపీపీ భూముల్లో వెంచర్లు వేస్తున్నారు. వందలాది ప్లాట్లను బాండ్ పేపర్ల మీద క్రయవిక్రయాలు చేపడుతున్నారు. నాలుగు వరుసల రహదారి పక్కనే సర్వే నంబర్ 50లో ఉన్న ఐదెకరాల బీడీపీపీ భూమిలో తాజాగా వెంచర్ వేశారు. రూ. 5 లక్షల చొప్పున ప్లాట్లను విక్రయిస్తున్నారు. అధికారపార్టీకి చెందిన ఇద్దరు నేతలు దీని వెనుక ఉండడంతో పంచాయతీ అధికారులు



జిల్లా కేంద్రంలోని ఫోర్‌వే పక్కన ఉన్న బీడీపీపీ భూమిలో సిద్ధం చేస్తున్న వెంచర్

సైతం మిన్నకుండిపోయారు. సర్వే నంబర్ 41లో కూడా ఇదేవిధంగా రూ.5 కోట్లు విలువజేసే ఐదెకరాల బీడీపీపీ భూమిలో వెంచర్ వేయడానికి సిద్ధమయ్యారు. సదరు భూమిని ఇప్పటికే చదును చేశారు. స్థానిక నేత ఒకరు దీనిని కొనుగోలు చేసి ప్లాట్లుగా విక్రయించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇక చెక్‌పోస్టుకు సమీపంలోని సర్వే నంబర్ 2లో ఉన్న నాలుగెకరాల బీడీపీపీ భూమిలో ప్లాట్లు వేసి విక్రయించగా ఇప్పుడు అక్కడ భారీ భవంతులు వెలిశాయి. ఈ భూమిని సైతం ఓ పార్టీ నాయకురాలి భర్త అక్రమంగా విక్రయించడం గమనార్హం. సర్వే నంబర్ 1లో ఉన్న రెండెకరాల బీడీపీపీ భూమిని సైతం కొందరు బినామీలు ఆక్రమించి హద్దులు పాతినా అధికార గణం పట్టించుకోవడం లేదు.

కఠినచర్యలు తీసుకుంటాం

జిల్లాలోని ఏజెన్సీ, జీడీపీపీ భూముల్లో ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా వెంచర్లు వేయరాదు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా అక్రమంగా వెంచర్లు వేస్తే నోటీసులు జారీ చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

– సురేందర్, ఇన్‌చార్జి డీపీవో

అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హేమంత్ బోర్కడే సహదేవ్‌రావు, అదనపు కలెక్టర్లు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

ఆసిఫాబాద్: ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, ఉన్నతాధికారులతో కంటి వెలుగు, ఆరోగ్య మహిళ, ధాన్యం కొనుగోళ్లు, ఇళ్ల స్థలాల నమోదు, ఇళ్ల క్రమబద్ధీకరణ, డబుల్‌బెడ్, ఆయిల్‌పాం, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని, అర్హులైన లబ్ధిదారులకు ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ హేమంత్ బోర్కడే మాట్లాడుతూ తిర్యాణి మండలం గిన్నెధరి పీహెచ్‌సీ, దహెగాం పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా కేంద్రాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యానికి చేరువలో ఉన్నామన్నారు. జిల్లాలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గన్నీ సంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచామన్నారు. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గతంలో పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల్లో ఇండ్లు నిర్మించకుండా ఉన్న వాటిని గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జీవో 58, 59 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారికి ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద కాగజ్‌నగర్ పట్టణంలో నిర్మాణమైన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టామన్నారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్న రైతులకు నీటివసతి, తమ వాటా డబ్బులు చెల్లించిన రైతులకు మక్కలు పంపిణీ చేయడంతో పాటు పంటసాగుపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ మందిరంలో కలెక్టర్ పూజలు



పూజలు చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

చింతలమానెపల్లి: మండలంలోని రవీంద్రనగర్ శ్రీకృష్ణమందిరంలో శనివారం కలెక్టర్ హేమంత్ బోర్కడే ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని శ్రీరాధా గోపీనాథ్ కుంజ్‌లో నిర్వహిస్తున్న అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమానికి ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. వేదిక మండలి వద్ద శ్రీకృష్ణ మందిరంలో పూజలో పాల్గొన్నారు. సర్పంచ్ సుశీల్ మండల్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- చింతలమానెపల్లిలో నూతన ఒరవడికి శ్రీకారం
- దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్ హేమంత్ బోర్కడే



రైతు సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్

చింతలమానెపల్లి: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కలెక్టర్ హేమంత్ బోర్కడే సహదేవ్‌రావు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. శనివారం చింతలమానెపల్లి మండలంలోని బాబాపూర్ ఆశ్రమ పాఠశాలలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. మండలంలోని బాబాపూర్, రణవెల్లి, గంగాపూర్, బూరెపెల్లి, కోర్సిని, రవీంద్రనగర్ గ్రామాల పరిధిలోని రైతుల భూములు రికార్డుల్లో తప్పులుగా నమోదు కావడంతో కొన్నేళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప రైతుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. పేర్ల నమోదులో తప్పులు, విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు, కొత్త పట్టా పుస్తకాలు రానివారు, రేషన్ కార్డుల సమస్యలపై 169 అర్జీలు వచ్చాయని, వీటన్నింటినీ త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాజేశం, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ ముష్కూర్ అలీ, ఎంపీపీ దుబ్బుల నానయ్య, జెడ్పీటీసీ దుబ్బుల శ్రీదేవి, ఎంపీడీవో మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ సభ విజయవంతం చేయాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి పట్టణంలోని నంబర్ 2 గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించనున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సభను విజయవంతం చేయాలని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు కోరారు. శనివారం గోలేటి సీహెచ్‌పీ, కైరిగూడ ఓసీపీ, ఏరియా వర్క్‌షాప్ కార్మికులతో మాట్లాడారు. సింగరేణి, కాంట్రాక్టు ఉద్యోగులు సాధ్యమైనంత వరకు యూనిఫాం, టోపీలు ధరించి సభకు హాజరు కావాలని సూచించారు. చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాష్‌రావు, నాయకులు కుమారస్వామి, వెంకటేష్, సదాశివ్, చంద్రశేఖర్, వీరస్వామి, రామారావు పాల్గొన్నారు.

మొక్కల రక్షణ మనందరి బాధ్యత

- డీఎల్‌పీవో సురేశ్‌బాబు



నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సురేశ్‌బాబు

కెరమెరి: 'మొక్కల రక్షణ మనందరి బాధ్యత అని డీఎల్‌పీవో సురేశ్‌బాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ నర్సరీకి నేమ్ బోర్డు ఏర్పాటు చేయాలని, నర్సరీలో మొక్కల సంఖ్య, వ్యయం తదితర వివరాలు ఎప్పటికప్పుడు రాయాలని, రైతులు స్వయంగా నర్సరీకి వచ్చి మొక్కలు తీసుకెళ్లేలా అవగాహన కల్పించాలని, సేంద్రియ మొక్కలతో జీవామృతం తయారు చేయాలని, జూన్ నాటికి మొక్కలను సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి జీపీడీపీ ప్రణాళికలు తయారు చేయాలని ఆపరేటర్లకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, ఎంపీవో సుదర్శన్ గౌడ్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య ఉన్నారు.

'అభయహస్తం' డబ్బులేవి?

- పథకం రద్దయినా అందని డబ్బులు
- లబ్ధిదారులకు తప్పని ఎదురుచూపులు
- వివరాలు సేకరించినా చెల్లింపుల్లో ప్రభుత్వ జాప్యం
- మార్గదర్శకాలు విడుదల చేయని ప్రభుత్వం



సమావేశమైన మహిళా సంఘాల సభ్యులు

కెరమెరి(ఆసిఫాబాద్): స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు ఆర్థికంగా భరోసా కల్పించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసిన అభయహస్తం పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం రద్దు చేసింది. మహిళలు జమ చేసుకున్న ప్రీమియం డబ్బులను గతేడాదే చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటికీ చెల్లించలేదు. పథకం రద్దయి ఆరేళ్లు గడుస్తున్నా డబ్బులు చెల్లించకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

2009లో పథకం ప్రారంభం

స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకోసం 2009లో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఐసీ అనుసంధానంతో అభయహస్తం పథకాన్ని ప్రారంభించింది. 18 ఏళ్ల నుంచి 59 సంవత్సరాలు నిండిన మహిళలంతా పథకంలో చేరేందుకు అవకాశం కల్పించారు. పథకంలో చేరిన సభ్యులు 59 ఏళ్లు నిండేవరకు ఏడాదికి రూ.365 చొప్పున చెల్లించేలా పథకాన్ని రూపొందించారు. పథకంలో చేరిన వారికి అభయహస్తం బాండ్లను సైతం అందించారు. 60 ఏళ్లు నిండిన సభ్యులు వారు జీవించినంతకాలం నెలకు రూ.500 పింఛన్ అందించేలా రూపకల్పన చేశారు. దురదృష్టవశాత్తు సభ్యులు మరణిస్తే సహజ మరణానికి రూ.35 వేలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.75 వేలు నామినీకి చెల్లించేలా పథకాన్ని అమలు చేశారు. దహన సంస్కారాలకు తక్షణ సాయంగా రూ.5వేలు అందిస్తారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉండి బీమా ప్రీమియం చెల్లించిన వారి పిల్లలు చదువుకుంటే ఇద్దరికి ఉపకార వేతనాలు కూడా అందజేశారు. 8, 9, 10వ తరతులతో పాటు ఇంటర్ చదువుకునే విద్యార్థులకు కూడా ఏడాదికి రూ.1,200 ఉపకార వేతనం అందించేలా ప్రణాళిక తయారు చేశారు.

ఏడాది కావస్తున్నా..

జిల్లాలో 36,256 మంది లబ్ధిదారులు ఉన్నారు.



అభయహస్తం బాండ్

అభయహస్తం పథకంలో భాగంగా 2009 నుంచి 2013 వరకు రూ.5 కోట్ల వరకు ప్రీమియం చెల్లించారు. డ్వాక్రా సంఘాల మహిళలు చెల్లించిన బీమా ప్రీమియం డబ్బులను వారి ఖాతాల్లో జమచేస్తామని గతేడాది ప్రభుత్వం ప్రకటించింది. వివరాలు సేకరించాలని డీఆర్‌డీఏ అధికారులకు ఆదేశాలు సైతం జారీ చేసింది. అభయహస్తం బాండు, బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులు, సెల్ నంబర్లు సైతం సేకరించిన అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. వివరాలు అందించి దాదాపు ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకూ మహిళల ఖాతాల్లో డబ్బులు జమకాలేదు. దీంతో జిల్లాలోని 36,256 మంది మహిళాసంఘాల సభ్యులు అభయ హస్తం డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు.

బకాయిలు చెల్లించాలి



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అభయహస్తం పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే తెలంగాణలో రద్దు చేశారు. ప్రస్తుతం మహిళలకు ఎలాంటి బీమా పథకాలు లేవు. అభయ హస్తం డబ్బులతో పాటు బీమా పరిహారం, ఉపకార వేతనాలు పూర్తిగా చెల్లించాలి.

– ఆబెదా, సుల్తాన్‌గూడ

ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు

అభయ హస్తం పథకం లబ్ధిదారులకు డబ్బుల చెల్లింపు విషయమై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. గతంలో వారి వివరాలు సేకరించిన విషయం వాస్తవమే. కానీ ఇప్పటి వరకు డబ్బులు తిరిగి ఇచ్చే విషయంపై మాకు ఎలాంటి సమాచారం లేదు.

– యశోద, ఐకేపీ డీపీఎం

క్లుప్తంగా

ఏడుగురిపై పిచ్చికుక్క దాడి


కుక్క కాటుకు గురై చికిత్స పొందుతున్న వ్యక్తి

భీమిని: కన్నెపల్లి మండలంలోని జజ్జరవెల్లి గ్రామపంచాయతీలో శనివారం పిచ్చికుక్క ఏడుగురిపై దాడి చేసి గాయపర్చింది. స్థానికుల వివరాల ప్రకారం... జజ్జరవెల్లి గ్రామంలో ఓ కిరాణ షాపు వద్ద రోడ్డుపై వచ్చిన వారిపై దాడి చేస్తూ గాయపర్చింది. దీంతో స్థానికులు కుక్కను హతమర్చారు. గాయపడిన వారు వెంటనే బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్నారు. గ్రామాల్లో పిచ్చికుక్కలను చంపివేయాలని అధికారులను వేడుకుంటున్నారు.

విద్యుత్ భద్రత వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ, అధికారులు

బెల్లంపల్లి: విద్యుత్ భద్రత వారోత్సవాల వాల్ పోస్టర్లను శనివారం బెల్లంపల్లి ఏసీపీ కార్యాలయంలో డిస్కం అధికారులు ఏసీపీ పంతాటి సదయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిస్కం ఎస్ఈ శేషారావు మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. తెగిన వైర్లు, స్తంభాలను ముట్టుకోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశముందని, వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం డిస్కం డివిజన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిస్కం బెల్లంపల్లి పట్టణ ఏడీఈ శ్రీనివాస్, బెల్లంపల్లి రూరల్ ఏడీఈ రాంచందర్, ఏఈలు శ్రీనివాస్, రాంమనోహర్, ప్రభాకర్ ఉన్నారు.

పంప్‌హౌస్ సర్వేను అడ్డుకున్న రైతులు


అధికారులతో మాట్లాడుతున్న రైతులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని పొక్కూరు గ్రామ శివారులో నిర్మించే పంప్‌హౌస్ నిర్మాణం కోసం శనివారం గ్రీడ్ సర్వే చేయడానికి వచ్చిన ఇరిగేషన్ అధికారులను రైతులు అడ్డుకున్నారు. ఎలాంటి సమాచారం లేకుండానే తమ పంట పొలాల్లో సర్వే చేపడుతున్నారని రైతులు మండిపడ్డారు. ఈ భూములే మాకు ఆధారమని, తాతల కాలం నుంచి ఈ భూములను సాగు చేసుకుంటూ బతుకుతున్నామన్నారు. అధికారులు రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా సర్వే చేయద్దని తెలిపారు.


గ్రూపు-4 స్టడీ మెటీరియల్ పంపిణీ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల షణ్ముఖ సాయి ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ డేవలపర్స్ ఆధ్వర్యంలో గ్రూప్-4 పరీక్షకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు శనివారం ఎమ్మెల్యే దివాకర్‌రావు, జేసీ మధుసూదన్‌నాయక్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ బేతి తిరుమల్‌రావు ఆధ్వర్యంలో 500 మందికి విన్నర్ పబ్లికేషన్ పుస్తకాలు అందజేశారు. సర్వే నీడి ఫౌండర్ గౌతమ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ పెంటరాజయ్య, వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేష్, షణ్ముఖ సాయి డెవలపర్స్ డైరెక్టర్లు శ్యాంసుందర్, బేతి సత్యం, ఆనంత సాయి పాల్గొన్నారు.

- నిరాదరణకు గురవుతున్న వయోవృద్ధులు
- అధికారులను ఆశ్రయిస్తున్న వైనం
- ఇకపై ఫిర్యాదులకు వెబ్‌సైట్

సండే స్పెషల్

అమ్మానాన్న భారమా..?!


కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన భాగాపూర్ వృద్ధ దంపతులు(ఫైల్)

వృద్ధాప్యం శాపంగా మారుతోంది. కనిపెంచిన తల్లిదండ్రులను అవసాన దశలో ఆదరించలేమంటూ సంతానం చేతులెత్తేస్తుడడం కలవరపెడుతోంది. ఆస్తులు పంచుకుని ఆప్యాయతను పంచలేమంటూ పిల్లలు ఎవరిదారి వారు చూసుకోవడంతో ఒంటరిగా జీవనం గడపాల్సి వస్తోంది. మరికొందరు పిల్లలు తల్లిదండ్రులను వంతులవారీగా చేరదీస్తుండడం వారిని మానసిక వేదనకు గురి చేస్తోంది. పిల్లల కోసం తమ జీవితాన్ని.. సర్వస్వాన్ని ధారబోసిన తల్లిదండ్రులకు జీవిత చరమాంకంలో ఆదరణ కరువవుతోంది. ఇటీవల సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామానికి చెందిన మెద బోయిన వెంకటయ్య(90) నలుగురు కుమారుల వద్ద వంతులవారీగా పోషణపై కలత చెంది ఆత్మహత్య చేసుకోవడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనూ నిరాదరణకు గురవుతున్న వృద్ధులు అధికారులు, పోలీసులను ఆశ్రయించడం కనిపిస్తోంది.

– సాక్షి, మంచిర్యాలడెస్క్

ఉమ్మడి జిల్లాలో కొన్ని ఘటనలు

- వృద్ధాప్యంలో ఉన్న తన పోషణ బాధ్యత చూడకుండా కొడుకు ఇంటి నుంచి వెళ్లగొట్టాడని, పోషణ కోసం కొంత సొమ్ము ఇప్పించాలని మంచిర్యాల జిల్లా తీగలపాడ్ గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి పూదరి చంద్రయ్య మార్చి 14న కలెక్టర్ సంతోష్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.
- మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం ద్వారక గ్రామానికి చెందిన సూరినేని రాజయ్య(80)కు పిల్లలు లేరు. తన అన్న కొడుకు చిరంజీవి వద్ద కరీంనగర్‌లో కొన్ని రోజులు ఉన్నాడు. తన వద్ద ఉన్న రూ.3లక్షలు, రెండు తులాల బంగారం తీసుకుని ఇవ్వడం లేదని, అతడిపై చర్యలు తీసుకుని డబ్బులు, బంగారం ఇప్పించాలని గత నెల 18న ప్రజావాణిలో కలెక్టర్ సంతోష్‌ను ఆశ్రయించాడు.
- నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం భాగాపూర్ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వారందరికీ పెళ్లిళ్లు చేసి ఓ ఇంటి వారిని చేశారు. ఆస్తిని పంచుకున్న పిల్లల్లో ఇద్దరు తల్లిదండ్రుల ఆలనాపాలనా తమ బాధ్యత కాదన్నారు. దీంతో చిన్న కుమారుడి సహాయంతో మిగతా ఇద్దరు కుమారులపై నిర్మల్ జిల్లా కలెక్టర్‌కు ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు..

వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సీనియర్ సిటిజన్స్ మెయింటనెన్స్ కేసెస్ అండ్ మానిటరింగ్ సిస్టమ్(టీఎస్‌సీఎంఎంఎస్)ను ఆర్డీవోల ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. వేధింపులు, అఘాయిత్యాలపై వయోవృద్ధులు ఫిర్యాదు చేసిన వెంటనే సత్వర న్యాయం చేయడానికి ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారు. తమ ఫిర్యాదులపై చర్యలు ఏ స్థాయిలో తీసుకుంటున్నారో ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంది. ఫిర్యాదులపై జిల్లా సంక్షేమ అధికారి, జిల్లాలోని రెవెన్యూ అధికారులు, కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమీక్షిస్తారు.

కొందరికి 'ఆసరా'

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వృద్ధులకు ఆసరా పింఛన్ కొంతవరకు భరోసానిస్తోంది. నెలనెలా అందే పింఛన్ డబ్బులను అవసరమైన మందులు, అనారోగ్య సమస్యలు, నిత్యావసర వస్తువుల కొనుగోలుకు వెచ్చిస్తున్నారు. పింఛన్ అందుతుండడంతో పిల్లల నుంచి కొంతవరకు గౌరవం లభిస్తుందనే అభిప్రాయాన్ని వృద్ధులు వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,36,757మంది రూ.2,016 చొప్పున పింఛన్ అందుకుంటున్నారు.

జిల్లాల్లో ఆసరా పింఛన్లు పొందుతున్న వృద్ధుల సంఖ్య	
ఆదిలాబాద్	31,404
మంచిర్యాల	40,921
నిర్మల్	39,462
కుమురంభీం	24,970

అనాథాశ్రమాలు.. ఆలయాలే దిక్కా..?



కారణాలు ఏవైనప్పటికీ పిల్లల ఆదరణ లేని తల్లిదండ్రులు కొందరికి అనాథ ఆశ్రమాలు, ఆలయాలే దిక్కవుతున్నా యి. అనాథ వృద్ధాశ్రమా ల్లో కొందరు ఆశ్రయం పొందుతుండగా మరికొందరు ఆలయాల వద్ద భిక్షాటన చేస్తున్నారు.

- మహారాష్ట్రలోని బోకర్ గ్రామానికి చెందిన గంగుబాయికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త చనిపోయి ఐదేళ్లు అవుతోంది. కుమారులు ఆలనాపాలన చూడకపోవడంతో నాలుగేళ్లుగా నిర్మల్ జిల్లా బాసర ఆలయ ప్రాంగణంలో భిక్షాటన చేస్తూ పొట్టపోసుకుంటోంది.
- కామారెడ్డి పట్టణానికి చెందిన వడ్డెర భూమవ్వకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మూడేళ్ల క్రితం భర్త చనిపోవడంతో కొడుకు వద్ద ఏడాదిపాటు ఉంది. గత సంవత్సరం కొడుకు అనారోగ్యంతో చనిపోవడంతో కూతుళ్ల వద్ద ఉండలేక నిర్మల్ జిల్లా బాసర ఆలయ ప్రాంగణంలో భిక్షాటన చేస్తూ జీవనం కొనసాగిస్తోంది.

ఇదీ వెబ్‌సైట్ :
https:// tsseniorcitizens. cgg. govt. in
ఎల్డర్‌లైన్ నంబరు :
14567

భయపడాల్సిన అవసరం లేదు



వయో వృద్ధుల మెయింటనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్ యాక్ట్ 2007 ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం తల్లిదండ్రుల సంక్షేమం కొడుకులు గానీ వారి ఆస్తికి ఎవరైతే వారసులవుతారో వారే చూసుకోవాలి. ఒకవేళ ఆస్తి తీసుకున్న తర్వాత పట్టించుకోకపోతే ఆర్డీవో ట్రిబ్యునల్‌లో కేసు వేసుకునే అవకాశం ఉంది. సీఆర్‌పీసీ 125 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసి మనోవర్తి పొందవచ్చు. న్యాయస్థానం తీర్పును నిరాకరించినట్లయితే ఆరు నెలల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తుంది. – శిల్పాశర్మ, న్యాయవాది, నోటరీ, మంచిర్యాల

వృద్ధులకు అండగా ఉంటున్నాం



మంచిర్యాల జిల్లా సీనియర్ సిటిజన్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి వృద్ధులు, నిరాదరణకు గురైన తల్లిదండ్రులకు అండగా నిలుస్తున్నాం. తల్లిదండ్రుల నుంచి ఆస్తులను తీసుకుని, వారిని చూసుకోవడంలో ఇబ్బంది పెడుతున్న వారిలో ఇప్పటికీ తొమ్మిది మందికి చట్టప్రకారంగా న్యాయం జరిగేలా చేశాం. ఆర్డీవోకు ఫిర్యాదు చేయడం వల్ల వృద్ధుల సంక్షేమ చట్టం ప్రకారం వారికి సరైన న్యాయం జరుగుతుంది. తల్లిదండ్రులు, పిల్లలతో అసోసియేషన్ సమక్షంలోనే మాట్లాడి సమస్య పరిష్కరిస్తున్నాం. పరిష్కారం కాకుంటే, ఆర్డీవోకు ఫిర్యాదు చేసి చట్ట ప్రకారం న్యాయం జరిగేలా చూస్తాం.
– బొలిశెట్టి రాజలింగు, మంచిర్యాల సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య సేవలు మెరుగుపర్చాలి


డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఎంఎస్ నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణిలో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు సీపీఆర్ఎం స్కీం కార్డుల కింద అందించే వైద్య సేవలు సరిగ్గా లేవని, వీటిని మెరుగుపర్చాలని కోరుతూ సింగరేణి పెన్షనర్స్ అసోసియేషన్ (బీఎంఎస్) నాయకులు కంపెనీ డైరెక్టర్(పా, ఫైనాన్స్) యన్.బలరాంను కోరారు. ఈ మేరకు ఆ యూనియన్ బీఎంఎస్ వేజ్‌బోర్డు సభ్యులు కె.లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మంద రమాకాంత్, టీ ఎస్ పవన్‌కుమార్‌లు శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో డైరెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. సీపీఆర్ఎంస్ కార్డులు వచ్చిన తరువాత కంపెనీ ఆసుపత్రుల్లో ఇన్‌పేషెంట్‌గా చేరిన కూడా వారి వద్ద నుంచి బిల్లులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ బిల్లులు కార్డు నుంచి డెబిట్ అవుతున్నాయని పేర్కొన్నారు. కంపెనీ ఆసుపత్రుల్లో ఉచిత చికిత్సలు అందించాల్సి ఉండగా ఇలా బిల్లులు వసూలు చేయడం మానుకోవాలని తెలిపారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ వంటి దూర ప్రాంతాల్లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగులు దీర్ఘకాలిక మందుల కోసం కంపెనీ ఆసుపత్రులకు రావడం ఇబ్బందిగా ఉందని, ఆయా పట్టణాల్లో కంపనీ రెఫరల్ ఆసుపత్రుల్లో ప్రత్యేక కౌంటర్లు పెట్టి మందులు ఇవ్వాలని కోరారు.రెఫరల్ ఆసుపత్రుల్లో చికిత్స పొందితే దానికి సంబంధించిన బిల్లులన్నీ నిమ్స్ టారిఫ్ ప్రకారం అదనంగా చెల్లించాల్సింది వస్తుందని, దీనిని కంపెనీ భరించాలని తెలిపారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీతకు సన్మానం


చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న జీఎం దేవేందర్


లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న రాంమ్మోహన్‌రావు

శ్రీరాంపూర్: మేడే సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ నుంచి శ్రమశక్తి అవార్డు అందుకున్న టీబీజీకేఎస్ జీఎం కమిటీ చర్చల ప్రతినిధి పెట్టం లక్ష్మణ్‌ను రాష్ట్ర ఫిలిం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పుస్కూర్ రామ్మోహన్‌రావు మంచిర్యాలలోని ఆయన నివాసంలో సత్కరించారు. కార్మిక వర్గానికి ఆయన చేసిన సేవలకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం సంతోషదాయకమన్నారు. మరింత ఉత్సాహంగా పని చేయాలని ఆకాంక్షించారు.

జీఎం సన్మానం

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను పురస్కరించుకుని శ్రమశక్తి అవార్డును అందుకున్న ఖైరిగూడ ఓసీపీ సీనియర్ మైనింగ్ సర్దార్‌గా పని చేస్తున్న గజ్జెల్లి చంద్రశేఖర్‌ను శనివారం జీఎం కార్యాలయంలో జీఎంతో పాటు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్ రావు, ఎస్‌వోటూజీఎం గుప్తా, ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం సతీష్‌బాబు, డీజీఎం ఎఫ్అండ్ఏ రామారావు, డీజీఎం ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహెరా, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

అన్‌ఫిట్ కేసులపై సమీక్ష


సమీక్షల్లో పాల్గొన్న డీజీఎం అరవిందరావు

శ్రీరాంపూర్: మెడికల్ అన్‌ఫిట్ అయిన వారికి మెడికల్‌కార్డులు, కారుణ్య ఉద్యోగాల కేసులపై జీఎం(పర్సనల్) బసవయ్య శ్రీరాంపూర్ ఏరియా అధికారులతో సమీక్ష నిర్వహించారు. శనివారం ఆయన కొత్తగూడెం నుంచి శ్రీరాంపూర్ డీజీఎం (పర్సనల్) అరవిందరావుతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారుణ్య ఉద్యోగాలు ఎంత మందికి ఇచ్చారు, ఇంకా ఎన్ని కేసులు ప్రాసెస్‌లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. సీఎంపీఎఫ్ సెటిల్‌మెంట్లు, రిటైర్డ్ అయిన తరువాత వారికి సీపీఆర్ఎంస్ కార్డులు త్వరగా అందేలా చూడాలన్నారు. పీఎం రాజేశ్వర్, డీవైపీఎంలు రాజేశ్, దేవేందర్‌రెడ్డి, పాలకుర్తి రాజు, సీనియర్ పీఓ కాంతారావులు పాల్గొన్నారు.

మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధిగా మధుకర్

పాతమంచిర్యాల: తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధిగా జి ల్లాకు చెందిన పొట్ట మధుకర్‌ను నియమించినట్లు తెలంగాణ మాల మహా నాడు రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపా రు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ నియామక ప్రక్రియ నిర్వహించామన్నారు.


నియామక పత్రం అందుకుంటున్న మధుకర్

మంచిర్యాలలో చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభం


ప్రారంభిస్తున్న హీరోయిన్ కృతిశెట్టి

- సందడి చేసిన హీరోయిన్ కృతిశెట్టి
- చూసేందుకు తరలివచ్చిన ప్రజలు


పరిశీలిస్తున్న కృతిశెట్టి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా కేంద్రంలో చెన్నయ్ షాపింగ్ మాల్‌ను ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, హీరోయిన్ కృతిశెట్టి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో వస్త్రాభరణాలను అందించే చెన్నయ్ షాపింగ్ మాల్‌ను మంచిర్యాలలో ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య మాట్లాడుతూ ప్రముఖ నగరాల్లో ఉండే షోరూంలకు మించిన స్థాయిలో మంచిర్యాలలో షోరూంను అన్ని హంగులతో తీర్చిదిద్దారని తెలిపారు. షోరూం మేనేజింగ్ డైరక్టర్లు ఎం.వెంకట్‌రెడ్డి, శౌధర్‌రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన తమ షోరూంలు ప్రతిచోటా అతి తక్కువ కాలంలోనే అక్కడి ప్రజల మన్ననలతో నంబర్ 1 షోరూంగా నిలుస్తుండడం ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుందన్నారు. అన్ని ఆదాయ వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన సంప్రదాయ వస్త్రాలు, మోడ్రన్ ఫ్యాషన్లను అందించడంలో మరింత ముందుంటామని అదే తమ విజయరహస్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జబర్దస్త్ కమెడియన్లు అదిరే అభి, రాజమౌళి, సద్దాం, ఇమానియెల్ కామెడీతో ఆకట్టుకున్నారు. హీరోయిన్ కృతిశెట్టిని చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో రాగా అభిమానులతో మాట్లాడి వారిలో మరింత జోష్‌ను నింపారు.

చెన్నయ్ షాపింగ్ మాల్‌లోనే కొంటాను

మంచిర్యాలలో చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభానికి అవకాశం రావడం అదృష్టమని, తాను చెన్నయ్ షాపింగ్ మాల్‌లోనే వస్త్రాలను కొంటానని హీరోయిన్ కృతిశెట్టి అన్నారు. షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన అనంతరం చీరలను పరిశీలించారు. ఇక్కడ అన్ని రకాల డిజైన్లు, వెరైటీలు, లేటెస్ట్ మోడల్‌లు లభిస్తాయని, ఈ ప్రాంత ప్రజలు షాపింగ్ చేసుకోవాలని కోరారు.

10న వాలీబాల్ జట్ల ఎంపిక

మంచిర్యాలటౌన్: ఈ నెల 10వ తేదీన వరంగల్ జిల్లాలో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు ఉంటాయని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్ల శంకర్, మైలారం శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 16 ఏళ్ల బాలబాలికలు సంబంధిత వయస్సు ధృవీకరణ పత్రాలు, 5 పాస్ ఫొటోలు వెంట తీసుకెళ్లాలని, ఇతర వివరాలకు 9951246104, 9676590211 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

అయ్యప్ప సేవా పురస్కార్‌కు రఘుపతిరావు ఎంపిక

శ్రీరాంపూర్: జాతీయ స్థాయి అయ్యప్ప సేవా పురస్కార్‌కు నస్పూర్‌కు చెందిన బీర్‌పూర్ రఘుపతిరావు ఎంపికైనట్లు అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ(ఏబీఏపీ) జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప దాస్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బేతి తిరుమల్‌రావు తెలిపారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారం అందించనున్నారు. తిరుమల్‌రావు నస్పూర్ కాలనీ హౌజింగ్ బోర్డు కాలనీలో లక్ష్మీగణపతి దేవాలయం చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయనకు ఈ పురస్కారం రావడంపై ఏబీఏపీ జిల్లా అధ్యక్షుడు వజ్రవేశు, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వీరబద్రస్వామి, ప్రధాన కార్యదర్శి భాస్కర్ల రాజేశంలు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్థిక సమానత్వం కోసం పోరాటం

బెల్లంపల్లి: ప్రజల్లో ఆర్థిక సమానత్వం కోసం పోరాటం సాగిస్తామని న్యూ ఇండియా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేవీ రాజు పటేల్ అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70ఏళ్లు గడిచిపోతున్నా ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు రావడం లేదన్నారు. పేదరికంతో ,ఆర్థికంగా చితికి పోతున్నారని అన్నారు. ఇందుకు పాలకులే ప్రధాన కారణమన్నారు. రాష్ట్రంలో తమపార్టీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తుందన్నారు. సమావేశంలో న్యూఇండియా పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, వేముల అశోక్, గోపాల్ , జాతీయ సమితి సభ్యులు బబిత సోని, రాష్ట్ర కన్వీనర్ తిరుపతి జనగామ, మహారాష్ట్ర ఇన్‌చార్జి తిరుపతి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ ఉన్నారు.

ఘనంగా పెర్సాపేన్‌కు పూజలు


బేటింగ్ అవుతున్న కొత్త కోడళ్లు


మొక్కులు చెల్లిస్తున్న మహిళలు


పెర్సాపేన్‌కు మొక్కుతున్న భక్తులు

కెరమెరి: ఈ నెల ఆదివాసీ దేవుళ్ల పండుగ మాసమని అంటారు. ఆదివాసీలున్న ప్రతీ ప్రాంతంలో తమతమ ఆచార వ్యవహారాలతో పెర్సాపేన్‌కు పూజలు చేస్తారు. మండలంలోని హట్టి గ్రామంలో శనివారం మెసల్కార్ మడావి వంశస్తులు పెర్సాపేన్ (పెద్దదేవుడు)కు పూజలు నిర్వహించారు. పెద్దదేవుడి ముందు మహిళలు ఆచార వ్యవహారాలతో పుట్నాలను సమర్పించారు. 22(44 జతలు) మంది కొత్త కోడళ్లు బేటింగ్ అయ్యారు. అనంతరం సంప్రదాయబద్ధంగా వరుసలో నిలబడి పూజలు చేశారు. గంగకు వెళ్లి పవిత్ర జలాన్ని తీసుకొచ్చి గ్రామంలో చల్లారు. ఇలా చేయడంతో పంటల్లో దిగుబడి వస్తుందని వారి నమ్మకం. ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన మడావి వంశస్తులు పెర్సాపేన్‌ను దర్శించుకున్నారు. ఇందులో కటోదా మడావి లక్ష్మణ్, ఆత్రం లక్ష్మణ్, అనంత్‌రావు, పటేల్ దంబిరావు, దేవారి భీంరావు, జంగు, మహదు, సాక్రుబాయి ఉన్నారు.